

# కొబ్బరి కల్పవృక్షం

తనలోని ప్రతి భాగాన్ని ప్రజలకు ఏదో ఒక విధంగా ఉపయోగపడేలా చేస్తుంది కొబ్బరిచెట్టు. అందుకే అందరూ దీన్ని ఎంతో ఇష్టంగా 'కల్ప వృక్షం' అని పిలుచుకుంటారు.

ప్రపంచంలో కొబ్బరి అధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం ఇండోనేషియా. రెండోస్థానంలో ఫిలిఫైన్స్ ఉండగా, భారతదేశానికి మూడోస్థానం. ఆంధ్రప్రదేశ్ లో కొబ్బరి సుమారు లక్ష హెక్టార్లలో సాగు చేయబడుతోంది. సాలీనా వెయ్యి మిలియన్ కాయలు ఉత్పత్తి అవుతున్నాయి. ఉత్పాదకత ఎకరాకు 6000 కాయలు. నెల్లూరు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, గోదావరీ జిల్లాలు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు. కోస్తా ప్రాంతాలు కొబ్బరి సాగుకు అనుకూలమైనవి.

***వాతావరణం, నేలలు :*** నీటి పారుదల, మురుగునీటి వసతి గల నేలలు శ్రేష్ఠం. సారవంతమైన నేలలు మిక్కిలి అనుకూలం. గాలిలో తేమ సమృద్ధిగా (80-90%) ఉండాలి.

***నాటే సమయం :*** మెరక ప్రాంతాల్లో జూన్-జులైలోనూ, వల్లపు ప్రాంతాల్లో అక్టోబర్, నవంబరులోనూ కొబ్బరి మొక్కలు నాటుకోవచ్చు.

***అంతర పంటలు :*** నాటిన 5 సంవత్సరాల లోపు మొక్కజొన్న, పుచ్చ, కూరగాయలు, పూల మొక్కలు, వేరుశనగ పంటలను, సారవంతమైన భూముల్లో దుంప పంటలనూ, 20 సంవత్సరాల పైబడిన ఎడల అరటి, కోకో, కంద, చామ, పసుపు, కూరగాయలు, అనాస, మిరియాలను అంతర పంటలుగా పండించ వచ్చు. నీటి వసతి దృష్టిలో ఉంచుకుని అంతర పంటలను ఎంపిక చేసుకోవాలి.

***దిగుబడి :*** నీటి కాయలకు(బోండాలు) 6-7 మాసాల వయస్సు గల కాయలు కోయాలి. కొబ్బరి కొరకు 11-12 మాసాల వయస్సు గల కాయలు కోయాలి. బోండాలు కోయటం వల్ల కొబ్బరి చెట్టుకు హాని కలగదు. ఎండు కొబ్బరిలో తేమ శాతం 6-8 కంటే ఎక్కువ ఉండకూడదు.

***కాయలు ఎప్పుడు కోయాలి ?*** కొబ్బరి కాయలు కోతకు సిద్ధంగా ఉన్నాయా లేదా అని తెలుసుకోటానికి సాధారణంగా రైతులు అవలంభించే పద్ధతి ఏమిటంటే . . .

- చెట్టు కింది వైపు నుండి, మొదటి ఆకు నుండి పరిగణనలోకి తీసుకున్నట్లయితే గెలలోని కాయ పక్కల కొద్దిగా ఒత్తుకుపోయి, రంగు, ప్రకాశం తక్కువగా ఉన్నట్లయితే, ఆ గెల కోతకు సిద్ధంగా ఉన్నట్లు లెక్క.
- క్రింద నుండి రెండో ఆకు గెల ముదురు ఆకుపచ్చ రంగులో మెరుస్తూ, నునుపుగా ఉన్నట్లయితే అవి నీటికాయలు (బోండాం)గా సిద్ధంగా ఉన్నట్లు లెక్క.
- **మూడో ఆకుగెల :** ఇది కమలా ఫలాల సైజులో చిన్నగా ఉంటాయి. ఈ గెలను బట్టి మొదటి గెలను కోయటానికి రైతులు ఎంపిక చేసుకుంటారు.

పైన చెప్పిన విధంగా కోతకు వచ్చిన గెలలను దించి, కొబ్బరి కాయల్ని 30 నుండి 60 రోజులు ఉంచినట్లయితే కాయ పక్వానికి వచ్చి పీచు ఎరుపు రంగుకు మారి కొబ్బరి తీయటానికి అనువుగా ఉంటుంది. అలా కాకుండ పై పీచు తీసి కాయలను అటకపై వుంచిన, కాయ మూతి పైకి వుండేట్లు, గాలి తగిలేట్లు నిలువుగా పెడితే కాయ లోపలి నీరు ఆవిరై పోయి కురిడీ తయారవుతుంది. మొలకెత్తు తాయన్న భయంతో కొంత మంది రైతులు గెలలు కోసి గుట్టలుగా పోసిన వెంటనే అమ్మేస్తారు. గెలలకు మంచి ధర రావటానికి కోసిన 60 రోజుల పాటు అలా నిల్వ ఉంచటం మంచిది. అవసరమనుకుంటే కురిడీ కోసం నిల్వ చేయవచ్చు. కోసిన 70-80 రోజుల వరకూ సహజంగా కొబ్బరి మొలకెత్తే అవకాశం లేదు.

కొబ్బరికాయలో కొబ్బరి తయారవటానికి గెల కోసిన తరవాత కనీసం 30 రోజులు పడుతుంది. గెలకోసిన 80 రోజుల వరకూ నిల్వ ఉంచినట్లయితే లోపలి కురిడీ బరువు పెరిగి నాణ్యత పెరుగుతుంది. ఒకవేళ 30 రోజుల లోపే కొబ్బరిని తీసినట్లయితే దాని నాణ్యత సరిగా ఉండదు. ఆ కొబ్బరి ముడుచుకుని పోయి, రబ్బరులా సాగుతుంది.

***కురిడీ అంటే ? :*** కొబ్బరిని ఎండబెట్టడం ద్వారా కురిడీ తయారవుతుంది. సాధారణంగా కొబ్బరిలో మొట్టమొదట సుమారు 50% వరకూ తేమ ఉంటుంది. దాదాపు ఆ తేమ ఆరు శాతానికి తగ్గించడం ద్వారా కురిడీ తయారవుతుంది.

అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం కొబ్బరి రైతులు సాధారణంగా 40% పంటని కాయలుగా అమ్మేసుకుంటున్నారు. మిగతా 60% పంట కొబ్బరిగా మార్చి అమ్మబడుతోంది. ఇందులో కూడా రైతులు స్వయంగా కొబ్బరి తయారు చేయటం 30% కాగా, మిగతాది చిన్న పరిశ్రమల వారు కొబ్బరి లేదా కురిడీగా మార్చి అమ్ముతున్నారు.

రైతు కోసం

***ఎకరా కొబ్బరిసాగుకయ్యే ఖర్చు మరియు ఆదాయం***

- ఎకరా కొబ్బరి సాగుకు అయ్యే ఖర్చు రూ. 7,000 నుండి రూ. 8,000.
- సగటు దిగుబడి ఎకరాకు 6,000 నుండి 7,000 కాయలు.
- సగటు కురిడీ దిగుబడి ఎకరాకు6-7 క్వింటాళ్ళు.
- కురిడీకి కనీస మద్దతు ధర క్వింటాలుకు 3,350 రూపాయలు.
- ఎకరాకు స్థూల ఆదాయం రూ. 15,000 నుండి రూ. 16,000.
- ఎకరాకు నికర ఆదాయం రూ. 8,000.

కేంద్ర ప్రభుత్వంలోని వ్యవసాయ శాఖ ప్రతి ఏడాది వ్యవసాయక ఉత్పత్తులకు, పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 2007 సంవత్సరానికి మిల్లింగ్ కొబ్బరికి కనీస మద్దతు ధర రూ. 3,350గా ప్రత్యేక ధర ప్రకటించారు. నాఫెడ్‌కు సంబంధించిన నోడల్ ఏజెన్సీగా ఆంధ్రప్రదేశ్ సహకార నూనె గింజల ఉత్పత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్‌లో కనీస మద్దతు ధరపై కొబ్బరి సేకరణ చేస్తోంది.

రైతులు కొబ్బరి తయారు చేయటానికి అంత సుముఖంగా ఉండరు. ఎందుకంటే అది శ్రమతో కూడిన పని. డబ్బు చేతికి రావటానికి చాలా సమయం పడుతుంది. అందుచేత కొబ్బరిని పంటపై అమ్మి వేయటంగానీ, కాయ దింపిన తరువాత ఒలిచిన కాయల రూపంలోగానీ అమ్మకం చేస్తుంటారు.

ప్రభుత్వం కొబ్బరి కాయలు కొనుగోలు చేసే పరిస్థితి కల్పించాలని కేరళ, ఆంధ్రప్రదేశ్ రైతులు కోరుతున్నట్లు భారత ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. 2008 సంవత్సరానికి కొబ్బరి కాయలకు కూడా కొబ్బరికి నిర్ణయించే ధరలకు అనుగుణంగా ధర నిర్ణయం జరుగుతుందని భారత ప్రభుత్వం సూచనప్రాయంగా నవంబర్, 2007లో తెలియ చేసింది. కొబ్బరి కాయలకు, ఎండుకొబ్బరికి వేరు వేరు ధరలు ప్రకటించవచ్చునీ, రైతులు అనువుగా ఉండే విధంగా అమ్ముకోవచ్చని భావించవచ్చు.

– డా॥ టి. రాధ, *IAS, V.C. & M.D; APOILFED*